## క్లుప్తంగా

### వరదరాజస్వామిగా అప్పన్న



సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజు గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను మరో పల్లకీలో వేంజేపచేశారు. సింహగిరి మాడ వీధిలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

### ముగిసిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలు



ట్రోఫీతో విజేత జట్టు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి వేణుగోపాల యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు పాల్గొని విజేత జట్టుకు ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల సందర్భంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల గ్రామస్తులందరికీ ఆహ్లాదం, వినోదంతో పాటు క్రీడాస్ఫూర్తిని నింపారన్నారు. కార్యక్రమంలో బొడ్డు రమణ, వియ్యపు నాని, గొలగాని సోమునాయుడు, కోమటి రమాదేవి, ఈసరపు అప్పలనాయుడు, దేవర తాతారావు, ఈసరపు అప్పలరాజు, చొప్పా శ్రీను, కడుపుట్ల శ్రీను, ప్రగడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



జీవీఎంసీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు

అగనంపూడి: నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. 88వ వార్డు దువ్వాడ పరిధిలోని దుకాణాల్లో దాడులు నిర్వహించిన సిబ్బంది 50 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, స్పూన్లు స్వాధీనం చేసుకొని జీవీఎంసీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నందున వ్యాపారులు వినియోంచవద్దని, విక్రయాలు చేయొద్దని, వినియోగదారులు దుకాణాలకు వచ్చే సమయంలో నార, గుడ్డ సంచులను వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అన్నార్తులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న పైల దివాకర్

మంత్రిపాలెం : కుమారుడు పైల శివతేజ 11వ వర్ధంతి సందర్భంగా శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పైల దివాకర్ గురువారం రైల్వే న్యూకాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో అన్నార్తులకు అల్పాహారం అందజేశారు. చిరంజీవి, సత్య మహారాణా, నమ్మి శ్రీనివాస్, మోక్షజ్ఞ పాల్గొన్నారు.



# తవ్వేశారు.. వదిలేశారు..



కుప్పలను దాటుకుని వాకింగ్ చేసేందుకు ఇబ్బంది పడుతున్న వాకర్స్

- వాకింగ్ పార్కులో తవ్వి వదిలేసిన గోతులు
- ఎక్కడికక్కడే మట్టి కుప్పలు
- వాకర్స్ అవస్థలు

మల్కాపురం: అభివృద్ధి పనుల పేరిట ఎక్కడికక్కడ తవ్వేసి వదిలేయడంతో వాకింగ్ పార్కుకు వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ పనులు ఎప్పుడు పూర్తవుతాయో, పార్కు మళ్లీ ఎప్పుడు సాధారణ స్థితికి వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద వాకింగ్ పార్కును జీవీఎంసీ అధికారులు 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ పార్కులో నిత్యం సుమారు 2వందల నుంచి 3 వందల మంది వాకర్లు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. పారిశ్రామిక ప్రాంతంలో జింక్ మైదానం, ఇక్కడ వాకింగ్ పార్క్ తప్ప ఎక్కడా వాకింగ్ పార్కు లేకపోవడంతో వాకర్స్ అందరూ ఇక్కడికే వచ్చి వాకింగ్ చేస్తుంటారు. అయితే అభివృద్ధి పనుల పేరిట వాకింగ్ పార్కులో గత వారం పలు చోట్ల తవ్వకాలను చేపట్టారు. అయితే తవ్విన గోతుల నుండి వచ్చే మట్టిని వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా అక్కడ నుండి తొలగించాల్సి ఉంది. కానీ, వాటిని అక్కడే మట్టి దిబ్బలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాకర్లు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయంలో వృద్ధులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పార్కులో అభివృద్ధి పనులు స్వాగతించదగినదే అయినా, వాకర్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను పలువురు కోరుతున్నారు.



వాకింగ్ పార్కు ఎంట్రన్స్‌లో ఇదీ పరిస్థితి..

### ఇబ్బందిగా ఉంది



ఆరోగ్యం కోసం వాకింగ్‌కు వస్తున్నాం. తీరా ఇక్కడ పార్కు చుట్టూ మట్టి దిబ్బలుగా ఉంది. వీటిని దాటుకుంటూ వాకింగ్ చేయడం చాలా ఇబ్బందిగా ఉంది. దీనిపై అధికారులకు వివరించినా నేటికి స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.

– నర్సింగరావు, సివిల్ ఇంజినీర్

### వృద్ధులకు చాలా కష్టమవుతోంది



సాయంత్రం సమయంలో వాకింగ్ పార్కుకు ఎక్కువమంది వృద్ధులు వస్తుంటారు. ఇక్కడ ఎక్కడికక్కడ మట్టిని వేసేయడంతో, ఆ కుప్పలు దాటలేక అదుపు తప్పి స్లిప్ అవుతున్నారు. వారి ఇబ్బందులైనా దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

– మజ్జి రమేష్‌పాత్రుడు, పోర్టు ఉద్యోగి



వాకింగ్ పార్కు ఆవరణలో కుప్పలుగా వేసిన మట్టి

### ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు

మల్కాపురం: ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచడంతో పాటు ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గాజువాక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ప్రవీణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒత్తిడిని పక్కన పెట్టి, డ్రైవర్లు అడుగులు వేయాలన్నారు. ఒకరి నిర్లక్ష్యం వల్ల మరో ఇంటి యజమానిని కోల్పోయే పరిస్థితి ఎదురవుతుందన్నారు. విధుల్లో నిత్యం అప్రమత్తంగా ఉంటూ, ఆర్టీసీ సంస్థ ప్రజలకు అండగా ఉందనే భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిపో మెకానికల్ చీఫ్ దుర్గాప్రసాద్, ఆర్టీసీ ట్రాఫిక్ సీఐ రామారావు పాల్గొన్నారు.

### 21న జాబ్‌మేళా

పెందుర్తి: స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి నిమిత్తం ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత సాధించి, 18–35 ఏళ్ల వయసుగల అభ్యర్థులు హాజరు కావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 77025 06614 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

# సేవలు 'హర్ష'ణీయం

- పాకెట్ మనీతో ఆపన్నులకు చేయూత
- ఆదర్శంగా నిలుస్తున్న టెన్త్ విద్యార్థి



నిరుపేదలకు వస్త్రాలు అందిస్తున్న తండ్రీ, కొడుకులు ప్రతాప్, హర్ష



పాకెట్ మనీతో వీధి కుక్కలకు భోజనం పెడుతున్న హర్ష

మల్కాపురం: 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం అందించే చేతులు మిన్న' అన్న మాటలను ఆచరణలో చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ బాలుడు. తండ్రి ఇచ్చే పాకెట్ మనీతో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రశంసలందుకుంటున్నాడు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం, కొత్త రామాలయం వీధిలో నివాసం ఉంటున్న దున్న ప్రతాప్, ప్రమీల దంపతుల కుమారుడు రామ్ చరణ్ హర్ష స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. హర్షకు తండ్రి రోజూ పాకెట్ మనీగా రూ.30 నుంచి 50 వరకు ఇస్తుంటారు. ఆ డబ్బును జాగ్రత్తగా దాచి, నెల రోజులు పూర్తి కాగానే సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాడు. మానసిక రోగులకు అల్పాహారం అందించడం, వీధి కుక్కలకు భోజనం పెట్టడం, పేదలకు వస్త్రాలు అందించడం వంటివి చేస్తున్నాడు. సేవలో ఎంతో సంతృప్తి ఉందని, 9వ తరగతి నుంచి ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నానని తెలిపాడు.

**తండ్రి బాటలోనే..**

హర్ష తండ్రి ప్రతాప్ కూడా సామాజిక సేవాకార్యకర్త. శ్రీహరిపురంలో స్వీట్‌స్టాల్ నిర్వహిస్తున్న ప్రతాప్ మానసిక రోగులకు సేవలు చేయడం, భిక్షాటన చేసుకుంటున్న వారికి సిబ్బంది సాయంతో స్నానం చేయించి, నూతన వస్త్రాలు వేసి, భోజనం పెట్టడం వంటివి చేస్తుంటారు. తండ్రీ తనయులు చేస్తున్న సేవలను అందరూ ప్రశంసిస్తున్నారు.

### రాత పరీక్షకు 221 మంది అర్హత



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఏయూ క్యాంపస్ : రాష్ట్ర స్థాయి నియామక బోర్డ్ పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి రాత పరీక్షకు 221 మంది ఎంపికయ్యారు. గురువారం 280 మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన వారు కైలాసగిరి వద్ద ఉన్న జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి పి.ఎం.టి, పి.ఈ.టి పరీక్షలకు 280 మంది హాజరయ్యారు. ముందుగా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి బయోమెట్రిక్ తీసుకున్నారు. అనంతరం దేహదారుఢ్య పరీక్షలు జరిపారు. వీరిలో 221 మంది తదుపరి మెయిన్ రాత పరీక్షకు అర్హత సాధించారు. అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

# 56వ రోజుకు కార్మికుల నిరసనలు



ఎన్ఏడీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో (ఎన్ఏడీ)లో విధుల్లో ఉన్న 36 మంది కార్మికుల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు గురువారానికి 56వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎన్ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యం చట్టసమ్మతం కాని విధంగా ఓవర్‌టైమ్ చేయించుకుంటోందని ఆరోపించారు. ఇప్పటికే 36మంది కార్మికులకు యాజమాన్యం చార్జిషీట్లు ఇచ్చిందని, దానికి తిరుగు సమాచారం కూడా ఇచ్చారని తెలిపారు. యాజమాన్యానికి సమాధానం ఇచ్చాం కాబట్టి విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పలు పరిశ్రమల కార్మిక సంఘాల నాయకుల మద్దతు పెరుగుతోందని తెలిపారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించి కార్మికులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐడీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# దయాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



దయాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: తిప్పల దయాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డిలు అన్నారు. తిప్పల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దయాల్‌రెడ్డి 19వ వర్ధంతి కార్యక్రమాన్ని గంగవరం పోర్టు వంతెన సమీపంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. దయాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తిప్పల కుటుంబ సభ్యులు, రిటైర్డ్ డీసీపీ సురేష్‌కుమార్, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, ధర్మాల శ్రీను, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, పెద్దిరెడ్డి, తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### తాబేళ్ల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలు, సుస్థిర చేపల వేట విధానంపై కలెక్టర్ గురువారం సమీక్షించారు. పలు శాఖల అధికారులు, శాస్త్ర వేత్తలు, ఫిషింగ్ బోట్ యజమానుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆడ తాబేళ్లు నవంబర్, ఫిబ్రవరి మధ్యలో తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ఇటీవల సముద్ర తాబేళ్ల మృత కళేబరాలు తీరానికి చేరడం గమనిస్తున్నామని, అవి చేపల వేట సమయంలో వలల్లోను, సముద్రంలో విడిచిపెట్టే తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో చిక్కుకుని మరణిస్తున్నాయని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఇలాంటి పరిణామాల వల్ల భవిష్యత్తులో ఆలీవ్ రిడ్లే రకపు తాబేళ్లు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తాబేళ్లు తప్పించుకునే అవకాశం ఉన్న టీఈడీ పరికరాన్ని వినియోగించాలన్నారు. వన్య మృగ సంరక్షణ చట్టం – 1972 ప్రకారం తాబేళ్లను చంపడం, తినడం, అమ్మడం, రవాణా చేయడం నిషేధం అన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీవాణి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, కేంద్ర మత్స్య సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్ కిజాకుడ్దీన్, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) జోనల్ డైరెక్టర్ భామి రెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, మెరైన్ సీఐ దివాకర్, మత్స్యశాఖ ఏడీ విజయ కృష్ణ, పోలీసు అధికారులు, నెట్ ఫిష్ స్టేట్ కో–ఆర్డినేటర్ హన్మంతరావు, మత్స్యశాఖ అభి వృద్ధి అధికారి ఆషాజ్యోతి, డాల్ఫిన్ మెకనైజ్డ్ బోటు యజమానుల సంఘ అధ్యక్షుడు వీర్రాజు, సంప్ర దాయ బోట్ల ప్రతినిధి జి.యల్లయ్య పాల్గొన్నారు.

# పరసల హోరు

- కణితి, దిబ్బపాలెం, అగనంపూడి ప్రాంతాల్లో వేడుకగా తీర్థాలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు



కణితి రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య



కణితి గాంధీ బొమ్మ కూడలిలో తీర్థ మహోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 79, 85, 87 వార్డుల్లోని నిర్వాసిత కాలనీల్లో పరస మహోత్సవాలు జోరందుకున్నాయి. 87వ వార్డు కణితి గాంధీ బొమ్మ కూడలిలోని రామాలయంలో సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆలయంలో పూజలు చేశారు. తర్వాత ఆవరణలో తప్పెటగుళ్లు, సాముగరిడీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, ప్రగడ శంకరరావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీను, గొనప సన్యాసినాయుడు, బొండా గోవిందరాజులు, విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

**దిబ్బపాలెంలో సీతారాముల తీర్థం..**

జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెం నిర్వాసిత కాలనీలో సీతారాముల పరస ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారాములకు పూజలు చేశారు. సాయంత్రం పరస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. చెట్టు భజనలు, సాము గరిడీలు, తోడపెద్ద, కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అగనంపూడి నిర్వాసిత కాలనీల నుంచి భక్తులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు శీరంశెట్టి బాబ్జి, యలమంచిలి అప్పారావు, గొల్లవిల్లి రామారావు, ఈగల నరసింగరావు, బుదిరెడ్డి చిన అప్పారావు, శీరంశెట్టి గోవిందరావు, పచ్చికోరు చిన్నారావు, దుల్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**జగన్నాథస్వామి పరస మహోత్సవం..**

జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో పరస ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దువ్వాడ ఎస్ఐ డి.శ్రీనివాసరావు పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు చెట్టు భజనలు, తోడపెద్దల భజన, సాము గరిడీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, ప్రతినిధులు గళ్ల సాయికుమార్, మామిడి నాగేశ్వరరావు, నరపిని నాగమణి, కుసుమంచి కుమారి, వరదారాణి, గొల్లవిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



దిబ్బపాలెం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దిబ్బపాలెంలో కోలాటం ఆడుతున్న మహిళలు



అగనంపూడి జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో గరిడీ

### మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదినారాయణ తదితరులు

అగనంపూడి: వచ్చే నెల 6వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు శ్రీకాకుళంలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభల వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ ఆవిష్కరించారు. కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపాధి, ఉద్యోగావకాశాల సాధన కోసం దేశ వ్యాప్తంగా ఏఐవైఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. నిరుద్యోగ సమస్యలపై యువతలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తుందని, నిరుద్యోగ యువత కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుతరావు, వై.రాంబాబు, నాయకులు జి.ఆనంద్, కిరణ్, లక్ష్మి, రజని, ఉమ తదితరులు పాల్గొన్నారు.